క్లుప్తంగా

వైఎస్సార్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడిగా సాలి వేణు



గోపాలపురం: వైఎస్సార్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని గోపవరానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు సాలి వేణు నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నెపురెడ్డి విజయభాస్కరరెడ్డి తనకు నియామక ఉత్తర్వులు పంపినట్టు వేణు బుధవారం తెలిపారు. ఈ పదవిలో తనను నియమించడానికి సహకరించిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌లకు సాలి వేణు కృతజ్ఞతలు తెలిపారు.

రామాలయం వద్ద అన్నసమారాధన

చాగల్లు: శ్రీరామ నవమి వేడుకల ముగింపు సందర్భంగా బ్రాహ్మణగూడెంలో బుధవారం సాయంత్రం అన్న సమారాధన నిర్వహించారు.రామాలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్న సమారాధనకు ఎస్.ముప్పవరం, గరప్పాడు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్నేహితుడి కుటుంబానికి రూ.50 వేల సాయం



విజయ్‌కుమార్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం గ్రామానికి చెందిన కొక్కిరపాటి విజయ్‌కుమార్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. పేదవాడైన విజయ్‌కుమార్ కుటుంబానికి ఆయన స్నేహితులంతా అండగా నిలిచారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల 2001–02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులందరూ కలిసి రూ.45 వేల నగదు, రూ.5 వేల విలువైన నిత్యావసర సరుకులను విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గెడ్డం రవీంద్రబాబు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'ఫ్యామిలీ ఫిజీషియన్'ను ప్రారంభించనున్న మంత్రి

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత చేతుల గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు తెలిపారు. ఉదయం 11 గంటలకు మండలంలోని కాపవరం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఈ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు.

గోదావరిలో మునిగి వృద్ధుడి మృతి

కొవ్వూరు: చాగల్లుకు చెందిన ఇంటి వెంకటేశ్వర్లు (70) అనే మతి స్థిమితం లేని వృద్ధుడి మృతదేహం బుధవారం కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి నదిలో తేలియాడుతూ కనిపించింది. మతి స్థిమితం సరిగా లేని ఆ వృద్ధుడు మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయల్దేరి కొవ్వూరు వచ్చాడు. ఈలోగా ఆ వృద్ధుడు ఎక్కడికి వెళ్లాడో తెలియక కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతకసాగారు. గోదావరి నదిలో వృద్ధుడి శవం తేలియాడుతున్నట్లు స్థానికుల ద్వారా తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఇక్కడకు వచ్చి చూసి ఆ మృతదేహం వెంకటేశ్వర్లుదిగా గుర్తించారు. కొవ్వూరు పట్టణ ఎస్సై డి.భూషణం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వీర వెంకట నాగదుర్గా శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై భూషణం తెలిపారు. గోదావరి నదిలో స్నానానికి దిగి గల్లంతై ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com

పల్లెల్లోనే పంటలకు చికిత్స

- ప్రతి మండలంలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు
- పీహెచ్‌డీసీ డాక్టర్లుగా ఆర్‌బీకే ఇన్‌చార్జులు
- వ్యవసాయ, ఉద్యాన పంటలకు సోకే చీడపీడలకు పరిష్కారాలు
- నియోజకవర్గంలో తాళ్లపాలెం, పాలంగి, అజ్జరం గ్రామాల ఎంపిక



నిడదవోలు మండలంలోని రైతు భరోసా కేంద్రం (ఫైల్)

నిడదవోలు రూరల్: మనిషి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. అలాగే పశువుల రోగాలను నయం చేసేందుకు వెటర్నరీ హాస్పిటల్స్ ఉన్నాయి. ఇదే తరహాలోనే పల్లెల్లోనే పంటలను కాపాడేందుకు ప్లాంట్ డయాగ్నోస్టిక్ సెంటర్లు (పీహెచ్‌డీసీ) ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలోని నిడదవోలు మండలం తాళ్లపాలెం, ఉండ్రాజవరం మండలం పాలంగి, పెరవలి మండలం అజ్జరం గ్రామాల్లో ఈ పీహెచ్‌డీసీలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

నాణ్యమైన దిగుబడులకు..

నిడదవోలు నియోజకవర్గంలో 16,800 హెక్టార్ల విస్తీర్ణంలో వ్యవసాయ పంటలు, 7,400 హెక్టార్లలో ఉద్యాన పంటలు, కోకో, పామాయిల్, వివిధ రకాల కూరగాయలు సాగవుతున్నాయి. చీడపీడల వల్ల వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతింటున్నాయి. పంటలకు సోకిన సమస్య ఏదో తెలియక రైతులు రకరకాల పురుగు మందులను పిచికారీ చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. మరోపక్క పండించిన పంటలు విషతుల్యం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు పెంచడం, చీడపీడలను సకాలంలో గుర్తించి, వాటి నివారణకు పరిష్కారాలను సూచించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ పీహెచ్‌డీసీలను ఏర్పాటు చేస్తోంది.

రానున్న ఖరీఫ్ నాటికి అందుబాటులోకి..

మొదటి దశలో మండలానికి ఒకటి చొప్పున ప్లాంట్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇవి రానున్న ఖరీఫ్ నాటికి రైతులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రతి మండలంలో సొంత భవనంలో కొనసాగుతున్న రైతు భరోసా కేంద్రాన్ని పీహెచ్‌డీసీగా గుర్తించాల్సి ఉంది. పీహెచ్‌డీసీ డాక్టర్లుగా మొదటి ప్రాధాన్యతగా అగ్రికల్చర్ ఎమ్మెస్సీ/ హార్టీకల్చర్ ఎమ్మెస్సీ చేసిన ఆర్‌బీకే ఇన్‌చార్జులను ఎంపిక చేయాల్సి వుంది. ఈ అర్హతలు కలిగిన వారు లేకపోతే అగ్రికల్చర్ బీఎస్సీ/ హార్టీకల్చర్ బీఎస్సీ చేసిన వారిని ఇన్‌ఛార్జులుగా ఎంపిక చేస్తారు.

ఈనెల 15 నుంచి శిక్షణ

ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్ డాక్టర్లకు అనుబంధంగా పొలంబడి ట్రైనర్స్‌లో ఇద్దరు ఉంటారు. వీరికి మూడు విడతలుగా 18 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఈనెల 15 నుంచి తొలి విడత శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సోకే చీడపీడలు, వాటి లక్షణాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. పంటలకు సోకే పురుగులు, వాటిని నివారించుకునేందుకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరిస్తారు. సూక్ష్మపోషకాల లోపాలు, వాటి లక్షణాలు, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ శిక్షణలో వివరిస్తారు. దీంతో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో ఎలాంటి సమస్య ఉత్పన్నమైనప్పటికీ మండలంలోని ఈ పీహెచ్‌డీసీలో నిర్ధారిస్తారు. సమస్యను అదుపు చేసేందుకు పరిష్కారాలను కూడా సూచిస్తారు.

రైతులకు ఉపయోగంగా..



ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్లను ఏర్పాటు చేయడం వల్ల అవి రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటాయి. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఆర్‌బీకేలను ఎంపిక చేశాం. పంటలకు సోకే ఎటువంటి చీడ, పీడ సమస్యలనైనా పీహెచ్‌డీసీల ద్వారా రైతులు పరిష్కరించుకోవచ్చు.

– జి.సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి, నిడదవోలు

గోష్పాద క్షేత్రంలో సరస్వతీ హోమం



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో సరస్వతీ హోమం నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు: చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్థానిక గోష్పాద క్షేత్రంలో బుధవారం రాత్రి సరస్వతీ హోమం నిర్వహించారు.ఈ యాగం వల్ల విద్యార్థులకు విద్యాబుద్ధులు ప్రాప్తిస్తాయని పండితుడు ఇనగంటి ఉమారామారావు అన్నారు. అధిక సంఖ్యలో బాలబాలికలు ఈ హోమంలో పాల్గొని పూజలు చేశారు. వారికి అవసరమైన పూజాద్రవ్యాలను నిర్వాహకులు అందజేశారు. పాలకోడేటి సత్యనారాయణమూర్తి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

శ్రీదేవి పాటెమ్మ జాతర ప్రారంభం

నిడదవోలు రూరల్: మండలంలోని కంసాలిపాలెం గ్రామదేవత శ్రీదేవి పాటెమ్మ వారి జాతర మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. పాటెమ్మ అమ్మవారిని సర్పంచ్ కొండపల్లి శ్రీనివాసరావు, గ్రామస్తులు దర్శించుకున్నారు. ఐదేళ్లకు ఒకసారి వచ్చే జాతర ఉత్సవాల్లో భాగంగా ఈనెల 27న అమ్మవారికి సేవ, 29న గ్రామోత్సవం, 30న నైవేద్యాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్ ఆవిష్కరణ



'దేవరపల్లిలో మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి తదితరులు

దేవరపల్లి: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా నిర్వహించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వైఎస్సార్ గృహ సారథులకు సూచించారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పోస్టర్‌ను బుధవారం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తలారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 21 వరకూ 14 రోజుల పాటు ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందుకోసం ప్రతి 50 గృహాలకు ఒక గృహసారథిని, ముగ్గురు గ్రామ సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్‌ను నియమించినట్టు చెప్పారు. ఒకొక్క గృహసారథి రోజుకు 5 నుంచి 10 గృహాలను సందర్శించి, నాలుగేళ్ల సీఎం జగన్ పాలన ఎలా ఉంది? సంక్షేమ పథకాల అమలు, పాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరిస్తారని ఆయన చెప్పారు. లబ్ధిదారులు చెప్పిన వాస్తవాలను నమోదు చేసి గృహ సారథులు ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్రబాబు, సర్పంచ్ వీరకుమారి, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, గృహ సారథుల మండల కన్వీనర్ కుసులూరి వెంకట సతీష్, నియోజకవర్గ మహిళా కన్వీనర్ గారపాటి రమాప్రభ, మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చేసిన పనులను ప్రజలకు వివరించాలి



నిడదవోలులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గత 45 నెలలుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు చేసిన అభివృద్ధిని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ఆ పార్టీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు మద్దిపాటి ఫణీంద్ర, అయినీడి పల్లారావు సూచించారు. పార్టీ నిడదవోలు నియోజకవర్గ కార్యాలయంలో ఈనెల 7 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించే 'జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం వాల్ పోస్టర్‌ను బుధవారం ఫణీంద్ర, పల్లారావు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ కన్వీనర్లు వెలగన పోలయ్య, చాన్‌బాషాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీను, దాకే అనిల్, వైఎస్సార్ సీపీ నాయకులు యాళ్ల రామారావు, పులుమంతుల రామారావు, గంగుల గోపీయాదవ్, ఫయాజ్, మస్తాన్, కాల్దారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు



భీమోలులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత

గోపాలపురం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల ఎందరో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత అన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలి స్వగ్రామమైన భీమోలులో కొడమంచిలి వెంకన్న, సీతమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట్రావు బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు లలిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. దాతలు ముందుకు వచ్చి గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈశిబిరంలో సుమారు 600 మంది వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ జమ్ముల మృదుల తెలిపారు. శిబిరంలో సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి, జిబాను ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కోడి రామలక్ష్మి వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండారు జగన్‌మోహన్‌రావు, కాకులపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పుట్టిన రోజు వేడుకలు



అనంతపల్లిలోని అయ్యప్ప స్వామి వారు

నల్లజర్ల: అయ్యప్ప పుట్టిన రోజు వేడుకలను మండలంలోని అనంతపల్లి గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి మదన గోపాలస్వామి ఆలయంలో ఉదయం అర్చకుడు దివి పాండురంగశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఆచరించే సూర్యమాస పంచాంగం ప్రకారం మీనమాసం ఉత్తరా నక్షత్రం నాడు అయ్యప్ప స్వామి వారి పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆయన వివరించారు. అనంతపల్లి–చోడవరం రహదారి పక్కనే గల అయ్యప్ప ఆలయం వద్ద బుధవారం రాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, రెండు వేల మందికి అన్నసమారాధన జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యులు కలం శ్రీనివాసరావు, నేమాల కోటేశ్వరరావు, ఆలపాటి సుబ్బారావు, చిక్కాల నాగేశ్వరరావు, ప్రత్తి శ్రీనుబాబు, మురళీకృష్ణ, చిట్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవ ధాన్యాల సాగుతో సంప్రదాయ పంటలకు ఊతం

ఉండ్రాజవరం: రైతులు రబీ వరి పంట కోసిన తర్వాత నవ ధాన్యాలను సాగు చేయాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ మహేష్ అన్నారు. మండలంలోని తాడిపర్రు గ్రామంలో రైతులకు బుధవారం ఆయన నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ ధాన్యాల సాగు పేరుతో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. సంప్రదాయ పంటల సాగుకు అండగా నిలవడం, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం, భూ సారాన్ని పెంచడం, ప్రజలకు సహజమైన ఆహార ఉత్పత్తులను అందించడం నవధాన్యాల సాగు ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఇందుకోసం ప్రకృతి వ్యవసాయ విభాగం విశేషంగా పనిచేస్తోందన్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా ఈ ఏడాది ఉండ్రాజవరం, తాడిపర్రు గ్రామాల్లో 600 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జ్ భవాని మాట్లాడుతూ మూడో పంట సాగు కోసం 30 రకాల పప్పు ధాన్యాలు, నూనె జాతులు, చిరుధాన్యాలు, విభిన్న జాతుల ఆకు కూరలు, విత్తనాలతో కూడిన 13 కేజీల కిట్లను నామమాత్రపు ధరలకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కూలింగ్ వాటర్ ప్లాంట్ పునఃప్రారంభం

కొవ్వూరు: పట్టణ ప్రెస్‌క్లబ్ వద్ద శివరామ సంస్థల అధినేత సత్యవరపు గోపాలకృష్ణ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం పునఃప్రారంభించారు. ఇటీవల మరమ్మతుకు గురైన కూలర్‌ను రిపేరు చేయించి మళ్లీ వినియోగంలోకి తెచ్చారు. ఈ సందర్భంగా మజ్జిగ వితరణ చేశారు. కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, ఆర్యవైశ్య సంఘ నాయకులు మట్టే ప్రసాద్, ఎంబీఎస్ ప్రసాద్, కొల్లేపర శ్రీనివాస్, మన్యం బల్లిబాబు, సత్యవరపు మురళి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నల్లా నాయుడుబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గంధం బాపూజీ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెనుగొండ: మండలంలోని చినమల్లంలో బైక్‌ను మరో బైక్ ఢీకొన్న ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రుకు చెందిన తాళ్లపల్లి ఇందిర.. కొడుకు సాయి మణికంఠతో కలిసి బుధవారం బైక్‌పై యలమంచిలి మండలం గుంపర్రు వెళుతోంది. చినమల్లం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో ఇందిరకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా, వాహనం ఘటనా స్థలానికి చేరేసరికి ఆమె మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన మరో మోటార్ సైకిల్ ఆగకుండా వెళ్లిపోవడంతో పోలీసులు దాని కోసం గాలిస్తున్నారు. మృతురాలి కుమారుడు సాయి మణికంఠ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పెనుగొండ ఎస్సై రమేష్ చెప్పారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

కొవ్వూరు: స్థానిక గౌతమీనగర్‌లోని పురుషోత్తమ రామ మందిరంలో బుధవారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రయుక్తంగా కళ్యాణతంతు నిర్వహించారు. పట్టణానికి చెందిన ప్రతాప్, సావిత్రి, వెంకట గణపతి, నాగదుర్గ దంపతుల చేతుల మీదుగా కల్యాణం జరిపించారు. వేద పండితుడు దోర్బల ప్రభాకర శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గురువారం ఆలయంలో స్వామి వారి పట్టాభిషేకం నిర్వహిస్తామన్నారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

వారిద్దరూ దేశానికి రెండు కళ్లు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



గోపాలపురం ఉప్పరగూడెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



నిడదవోలు పట్టణంలోని సుబ్బరాజుపేటలో..

గోపాలపురం: బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లు దేశానికి రెండు కళ్ల వంటి వారని, ఆ మహా నేతలను స్మరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దళిత బాంధవుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని మూడు నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. గోపాలపురంలోని ఉప్పరగూడెంలో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణలు, భీమోలులో జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత జగ్జీవన్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక జగ్జీవన్‌రామ్ సెంటర్లో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొని దళిత నేతకు నివాళులు అర్పించారు. జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ.15 లక్షలు మంజూరు చేసినట్టు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షులు కూచిపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ వర్ధనపు కిశోర్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో జోగేశ్వరరావుల ఆధ్వర్యంలో దళిత బాంధవునికి నివాళులు అర్పించారు

తాళ్లపూడి: అన్నదేవరపేట, పెద్దేవం, వేగేశ్వరపురం, పైడిమెట్ట సెంటర్, తాళ్లపూడి, మలకపల్లి, గజ్జరం, బల్లిపాడు తదితర గ్రామాల్లో జగ్జీవన్ జయంతి వేడుకలు నిర్వహించారు. అన్నదేవరపేట, పెద్దేవం వేడుకల్లో ఎంపీపీ జొన్నకూడి పోశిరాజు, పోశిన శ్రీకృష్ణదేవరాయులు, సర్పంచ్ తిరిగిపల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

.చాగల్లు: మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్ చిత్ర పటానికి ఎంపీపీ మట్టా వీరాస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. చాగల్లు అరుంధతీ పేట, ఎస్.ముప్పవరం, ఊనగట్ల, చిక్కాల, కలవలపల్లి, గౌరిపల్లి, మీనానగరం, బ్రాహ్మణగూడెం, దారవరం, కుంకుడుమిల్లి, మల్లవరం గ్రామాల్లో మాజీ ఉప ప్రధానికి నివాళులు అర్పించారు.

నిడదవోలు రూరల్: అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. నిడదవోలు పట్టణంలోను మండలంలోని పలు గ్రామాల్లోనూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలోను, సుబ్బరాజుపేటలోను జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిమ్మరాజుపాలెంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు ఆధ్వర్యంలోను, సమిశ్రగూడెంలో బాబూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలోను వేడుకలు జరిగాయి. కోరుమామిడిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉండ్రాజవరం: వేలివెన్నులో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఉండ్రాజవరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, వైస్ ఎంపీపీ ఎన్.సరోజ, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు, ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామి నాయుడు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పెరవలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాకరపర్రులో యువకులు ఘనంగా జగ్జీవన్ జయంతిని నిర్వహించారు.

CHAITANYA COLLEGE OF EDUCATION
Sponsored By Maddala Educational Society, Regd.571/06
Approved by NCTE-New Delhi, Affiliated to Adi Kavi Nannaya University, Rajahmundry.
SURAPURAM (V&P), NIDADAVOLE, East Godavari Dist.,-534305, A.P.

B.Ed. MANAGEMENT QUOTA (CAT- 'B') SEATS ARE AVALABLE FOR THE ACADEMIC YEAR - 2022-23
B.Ed. SPOT ADMISSION FOR THE YEAR 2022-23 (Left Over and dropout vacancies)
LAST DATE FOR ADMISSIONS 14.04.2023
Methodologies : Maths, Physical Science, Biological Science, Social Science & English.
Eligibility : 50% of Marks in aggregate at graduate level for OC and 45% Marks under for BC, SC, & ST with or without Ed CET 2022-2023.
Contact : 79891 41725
Surapuram (V&P), Nidadavole
Date : 05-04-2023
MADDALA SUNEETA, Ex. M.L.A
Secretary & Correspondant

ఖాళీ స్థలముల లైసెన్సు హక్కుపైకు ఈ టెండర్ మరియు సీల్డ్ టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన
[illegible]
https://tender.apeprocurement.gov.in
[illegible]